పెప్సీకో నూతన లోగో

న్యూఢిల్లీ, మార్చి 1: అంతర్జాతీయ శీతలపానీయాల సంస్థ పెప్సీకో.. రీబ్రాండింగ్‌లో భాగంగా నూతన లోగోను ఆవిష్కరించింది. 14 ఏండ్ల తర్వాత లోగోను మార్చడం ఇదే తొలిసారని అమెరికాకు చెందిన శీతల పానీయాల సంస్థ ప్రకటించింది. నూతన లోగోను ముంబైలోని గేట్‌వే ఆఫ్ ఇండియా వద్ద ఆవిష్కరించింది.

హీరో సరికొత్త స్కూటర్

ధర రూ.1.15 లక్షలు

హైదరాబాద్, మార్చి 1: ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటో కార్ప్..తాజాగా దేశీయ మార్కెట్లోకి మరో స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. విదా వీ1 ప్లస్ పేరుతో విడుదల చేసిన ఎలక్ట్రిక్ స్కూటర్ ధరను రూ.1.15 లక్షలుగా నిర్ణయించింది. 6 కిలోవాట్ల ఎలక్ట్రిక్ మోటర్ కలిగిన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 100 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఫేమ్ 2 సబ్సిడీ, పోర్టబుల్ చార్జర్ కలుపుకొని సంస్థ ఈ ధరను నిర్ణయించింది. విదా వీ1 ప్రొ, వీ1 ప్లస్ మాడళ్ల కంటే ఇది రూ.30 వేలు తక్కువ ధరకు లభించనున్నది. కేవలం 3.4 సెకండ్లలో 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ స్కూటర్ గంటకు 80 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్నది. పూర్తిస్థాయి డిజిటల్ క్లస్టర్, ఎల్‌ఈడీ లైటింగ్, స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీ వంటి ఫీచర్స్‌తో రూపొందించింది.

మార్కెట్లో రికార్డుల జాతర

ఆల్‌టైమ్ హైకి దేశీయ స్టాక్ మార్కెట్లు • కొనుగోళ్ల జోష్‌లో మదుపరులు

ఒక్కరోజే రూ.4.29 లక్షల కోట్లు ఎగిసిన ఇన్వెస్టర్ల సంపద



ముంబై, మార్చి 1: దేశీయ స్టాక్ మార్కెట్లలో బుల్ రన్ దుమ్ము రేపింది. కొనుగోళ్ల జోష్‌లో మదుపరులు రెచ్చిపోయారు. దీంతో మునుపెన్నడూ లేనివిధంగా సూచీలు సరికొత్త స్థాయిలను చేరాయి. శుక్రవారం బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,245.05 పాయింట్లు లేదా 1.72 శాతం ఎగిసి ఆల్‌టైమ్ హై 73,745.35 వద్ద ముగిసింది. ఒకానొక దశలోనైతే 1,318.91 పాయింట్లు లేదా 1.81 శాతం పుంజుకొని ఇంట్రా-డే రికార్డు హై 73,819.21ని నెలకొల్పింది. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 355.95 పాయింట్లు లేదా 1.62 శాతం ఎగబాకి లైఫ్‌టైమ్ హై 22,338.75 దగ్గర నిలిచింది. ఇంట్రా-డే లోనూ 370.5 పాయింట్లు లేదా 1.68 శాతం పెరిగి 22,353.30ను తాకింది.

ఇందుకే ఈ ఉత్సాహం

తయారీ రంగం దన్నుతో ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో దేశ జీడీపీ గణాంకాలు ఆకర్షణీయంగా ఉండటం కలిసొచ్చిందని మార్కెట్ నిపుణులు తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. విదేశీ పెట్టుబడుల రాక పెరుగుతుండటం, అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో లాభాలు, ఫిబ్రవరి నెల వాహన విక్రయాలు బాగుండటం కూడా మార్కెట్ రికార్డుస్థాయి లాభాలకు దోహదం చేసినట్టు చెప్తున్నారు.

రంగాలవారీగా

మెటల్ రంగ షేర్లు అత్యధికంగా 3.84 శాతం పెరిగాయి. క్యాపిటల్ గూడ్స్ 2.49 శాతం, బ్యాంకింగ్ 2.48 శాతం, ఆటో 2.23 శాతం, ఎనర్జీ 2.14 శాతం, చమురు, గ్యాస్ 2.14 శాతం, కమోడిటీస్ 2.12 శాతం, ఇండస్ట్రియల్స్ 1.91 శాతం చొప్పున పుంజుకొన్నాయి. ఐటీ, టెక్నాలజీ రంగాల షేర్లు మాత్రం నష్టపోయాయి. ఇక బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.89 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.68 శాతం పెరిగాయి. టాటా స్టీల్ షేర్ విలువ గరిష్ఠంగా 6 శాతానికిపైగా ఎగబాకింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 4 శాతానికిపైగా పెరిగింది. ఎల్‌అండ్‌టీ, టైటాన్, మారుతీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటర్స్ షేర్లూ పుంజుకున్నాయి.

4.29 లక్షల కోట్లు..

మార్కెట్ ర్యాలీతో బీఎస్ఈ నమోదిత సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన మదుపరుల సంపద ఈ ఒక్కరోజే రూ.4.29 లక్షల కోట్లు పెరిగింది. రూ.4,29,339.75 కోట్లు అందుకుని బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3,92,25,029.98 కోట్ల (4.78 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది. ఇక విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) గురువారం రూ.3,568.11 కోట్ల పెట్టుబడులను పెట్టినట్టు స్టాక్ ఎక్స్చేంజ్ వర్గాలు తెలిపాయి.

గ్లోబల్ మార్కెట్లలో

ఆసియా మార్కెట్లలో జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లలోనూ కీలకమైన జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ సూచీలు లాభాల్లో కదలాడుతున్నాయి. అమెరికా మార్కెట్లు కూడా గురువారం లాభాల్లోనే స్థిరపడ్డాయి. ఈ ప్రభావం దేశీయ ఈక్విటీ మార్కెట్ల ట్రేడింగ్‌పై పడిందని ట్రేడర్స్ అభిప్రాయపడుతున్నారు.



నేడు ప్రత్యేక ట్రేడింగ్

దేశీయ స్టాక్ మార్కెట్లలో శనివారం ప్రత్యేక ట్రేడింగ్ జరుగనున్నది. అటు బీఎస్ఈ, ఇటు ఎన్ఎస్ఈలు.. ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ సెగ్మెంట్లలో ఈ స్పెషల్ ట్రేడింగ్ సెషన్స్‌ను నిర్వహించనున్నాయి. తొలుత ఉదయం 9:15 గంటల నుంచి 10 గంటల వరకు 45 నిమిషాలపాటు ప్రైమ్ సైట్ (పీఆర్)పై, ఆ తర్వాత ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు గంటపాటు డిజాస్టర్ రికవరీ (డీఆర్) సైట్‌పై ప్రత్యేకంగా ట్రేడింగ్‌లను చేపట్టనున్నారు. ఈ మేరకు బాంబే స్టాక్ ఎక్స్చేంజ్, నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్‌లు వేర్వేరు ప్రకటనలు చేశాయి. ప్రైమరీ సైట్‌పై వైఫల్యాలు, అంతరాయాలు ఏర్పడితే ఎదుర్కొనేందుకున్న సంసిద్ధతను పరీక్షించేందుకే ఈ ప్రత్యేక ట్రేడింగ్‌లను చేస్తున్నారు.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రూ.2,441.44 కోట్ల విలువైన డివిడెండ్ చెక్కును అందజేస్తున్న ఎల్ఐసీ చైర్మన్ సిద్ధార్థ మోహంతీ. చిత్రంలో ఆర్థిక సేవల కార్యదర్శి వివేక్ జోషితోపాటు కంపెనీ ఉన్నతాధికారులు కూడా ఉన్నారు.

పెరిగిన ఎన్ఎండీసీ ప్రొడక్షన్

న్యూఢిల్లీ, మార్చి 1: ప్రభుత్వరంగ సంస్థ ఎన్ఎండీసీ మెరుగైన పనితీరు కనబరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి వరకు సంస్థ 40.24 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేసింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఉత్పత్తి చేసిన 35.62 మిలియన్ టన్నులతో పోలిస్తే 13 శాతం అధికమని పేర్కొంది. ఇదే సమయంలో కంపెనీ విక్రయాలు 33.42 మిలియన్ టన్నుల నుంచి 21 శాతం ఎగబాకి 40.48 మిలియన్ టన్నులకు చేరుకున్నట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. కానీ, ఫిబ్రవరిలో కంపెనీ ఉత్పత్తి ఏడాది ప్రాతిపదికన 12 శాతం తగ్గి 4.48 మిలియన్ టన్నుల నుంచి 3.92 మిలియన్ టన్నులకు పడిపోగా, అమ్మకాల విషయానికి వస్తే 3.78 మిలియన్ టన్నుల నుంచి 3.99 మిలియన్ టన్నులకు పెరిగింది.

627 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి

సింగరేణి సీఎండీ బలరాం వెల్లడి

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 627 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేశామని సింగరేణి సీఎండీ బలరాం వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి ఉత్పత్తి చేసిన 601 లక్షల టన్నులతో పోలిస్తే 4.3 శాతం అధికమని ఆయన పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి 700 లక్షల టన్నుల వార్షిక లక్ష్యాన్ని అధిగమించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కంపెనీ ఉన్నతాధికారులకు సూచించారు. శుక్రవారం సింగరేణి భవన్‌లో జరిగిన సమీక్ష సమావేశానికి కంపెనీ డైరెక్టర్లు, ఏరియాల జనరల్ మేనేజర్లు హాజరయ్యారు. నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకోవాలంటే ఈ నెలలో రోజుకు 2.35 లక్షల టన్నుల బొగ్గును వెలికి తీయాల్సిన అవసరం ఉన్నదని, అప్పుడే లక్ష్యాన్ని అధిగమించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. మొత్తం 12 ఏరియాల్లో మణుగూరు, కొత్తగూడెం, ఇల్లెందు, బెల్లంపల్లి ఏరియాలు లక్ష్యాలు అధిగమించడంపై సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజల వద్ద 8,470 కోట్ల విలువైన 2 వేల నోట్లు

ముంబై, మార్చి 1: చలామణిలో ఉన్న రెండు వేల రూపాయల నోట్లలో 97.62 శాతం తిరిగి బ్యాంకుల్లో జమయ్యాయని రిజర్వ్‌బ్యాంక్ తాజాగా వెల్లడించింది. ఈ నోటును ఉపసంహరించుకొని తొమ్మిది నెలలు అయినప్పటికీ ఇంకా ప్రజల వద్ద రూ.8,470 కోట్ల విలువైన 2 వేల నోట్లు ఉన్నాయని పేర్కొంది. గతేడాది మే 19న ఈ నోట్‌ను రిజర్వ్‌బ్యాంక్ ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. ఉపసంహరించుకున్నప్పుడు మార్కెట్లో రూ.3.56 లక్షల కోట్ల విలువైన నోట్లు ఉండగా..ప్రస్తుతం ఇవి రూ. 8,470 కోట్లకు తగ్గాయని సెంట్రల్ బ్యాంక్ తాజాగా వెల్లడించింది. వీటిలో 97.62 శాతం నోట్లు తిరిగి బ్యాంకుల్లో జమయ్యాయని, ఫిబ్రవరి 29, 2024 నాటికి ఇంకా రూ.8,470 కోట్ల విలువైన నోట్లు జమకాలేదని ఆర్బీఐ ఒక ప్రకటనలో వెల్లడించింది.

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు మరో దెబ్బ

రూ.5.49 కోట్ల జరిమానా విధించిన ఎఫ్ఐయు • పీఎంఎల్ఏ నిబంధనల ఉల్లంఘనే కారణం

న్యూఢిల్లీ, మార్చి 1: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై భారతీయ ఆర్థిక నిఘా విభాగం (ఎఫ్ఐయు-ఇండియా) రూ.5.49 కోట్ల జరిమానా విధించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) నిబంధనల ఉల్లంఘనకుగాను ఈ ఫైన్ పడినట్టు శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. కాగా, పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై వివిధ దర్యాప్తు సంస్థల నుంచి అందుకున్న సమాచారం మేరకు ఈ మొత్తం వ్యవహారంపై ఎఫ్ఐయు-ఇండియా సమీక్ష చేస్తున్నది. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌సహా అక్రమ కార్యకలాపాలు, వ్యాపారాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. నేరాలు, ఇతర చట్ట వ్యతిరేక పనులతో ఆర్జించిన సొమ్మును పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఖాతాల్లో ఉంచారన్న దానిపై దృష్టిపెట్టినట్టు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది.

సంక్షోభం నేపథ్యంలో..

ఆర్బీఐ ఆంక్షల నడుమ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌తో పేటీఎంకున్న అంతర్ సంస్థ ఒప్పందాల నిలుపుదలకు తమ బోర్డు ఆమోదించినట్టు దాని మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ శుక్రవారం తెలిపింది. దీనివల్ల ఒక సంస్థపై మరో సంస్థ ఆధారపడటం తగ్గుతుందని పేర్కొన్నది. ఫిబ్రవరి 29 నుంచి కస్టమర్ల ఖాతాల్లో డిపాజిట్లు లేదా క్రెడిట్లను అనుమతించరాదని జనవరి 31న పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత దాన్ని ఈ నెల 15దాకా పొడిగించిన సంగతీ విదితమే.

వాహనాలకు ఎస్‌యూవీ దన్ను

ఫిబ్రవరిలో రికార్డు స్థాయికి చేరుకున్న విక్రయాలు

న్యూఢిల్లీ, మార్చి 1: వాహన విక్రయాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయి. ఇదేక్రమంలో దేశవ్యాప్తంగా స్పోర్ట్ యుటిలిటీ వాహనాలకు డిమాండ్ అధికంగా ఉండటంతో గతనెలకుగాను అమ్మకాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఆటోమొబైల్ దిగ్గజాలైన మారుతి సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటర్స్‌లు సింగిల్ డిజిట్‌ను వృద్ధిని నమోదు చేసుకోగా..మహీంద్రా అండ్ మహీంద్రా, టయోటా కిర్లోస్కర్, హోండా కార్స్‌లకు చెందిన మాడళ్లకు డిమాండ్ అధికంగా నమోదైంది. దేశీయ ఆటోమొబైల్ రంగంలో అత్యధికంగా అమ్ముడైన వాహనాల జాబితాలో ఇది మూడోసారి. ఈ ఏడాది జనవరిలో అత్యధికంఆ 3,94,500 యూనిట్లతో తొలిస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి 3,91,811 యూనిట్లతో అక్టోబర్ 2023 రెండో స్థానంలో నిలిచింది.

- గత నెలలో మారుతి సుజుకీ దేశీయంగా ప్యాసింజర్ వాహన విక్రయాలు 9 శాతం ఎగబాకి 1,60,271లకు చేరుకున్నాయి. ఏడాది క్రితం ఇది 1,47,467 యూనిట్లు ఉన్నాయి.
- టాటా మోటర్స్ 51,321 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలను విక్రయించింది. ఏడాది క్రితం అమ్మిన వాహనాలతో పోలిస్తే 19 శాతం అధికం.
- అలాగే మహీంద్రా అండ్ మహీంద్రా పీవీ సేల్స్ ఏడాది ప్రాతిపదికన 40 శాతం అధికమై 42,401 యూనిట్లకు చేరుకున్నాయి. గతేడాది ఇది 30,358 యూనిట్లుగా ఉన్నాయి.
- టయోటా కిర్లోస్కర్ రికార్డు స్థాయిలో 25,220 యూనిట్లను విక్రయించింది.
- హీరో మోటోకార్ప్ హోల్‌సేల్ అమ్మకాలు 19 శాతం పెరిగి 4,68,410 యూనిట్లకు చేరాయి.

ఫిబ్రవరి నెలలో దేశీయంగా అమ్ముడైన వాహనాలు

సంస్థ	2024	2023	వృద్ధి (శాతంలో)
మారుతి	1,97,471	1,72,321	15
హ్యుందాయ్	60,501	57,851	4.5
టాటా మోటర్స్	86,406	79,705	8
టయోటా	25,220	15,685	61
మహీంద్రా	72,923	58,801	24
ఎంజీ మోటర్	4,532	4,193	8
రాయల్ ఎన్‌ఫీల్డ్	75,935	71,544	6
టీవీఎస్ మోటర్	3,68,424	2,76,150	33
హోండా మోటర్‌సైకిల్	4,58,711	2,47,195	86
సుజుకీ మోటర్‌సైకిల్	97,435	70,621	38

ప్యాసింజర్ వాహన విక్రయాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. వరుసగా 14 నెలలో కూడా ఎస్‌యూవీల సేల్స్ దూసుకుపోయాయి. ప్రస్తుత ఆర్థిఖ సంవత్సరంలో 16 లక్షల వాహనాలు అమ్ముడయ్యే అవకాశాలు ఉన్నాయి. మొత్తం ఇండస్ట్రీ 42.1 లక్షల యూనిట్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నా.

- శశాంక్ శ్రీవాత్సవ, మారుతి సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్

ఫారెక్స్ రిజర్వులు జంప్

ముంబై, మార్చి 1: వరుసగా తగ్గుతూ వచ్చిన విదేశీ మారకం నిల్వలు మళ్లీ పెరిగాయి. ఫిబ్రవరి 23తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 2.975 బిలియన్ డాలర్లు పెరిగి 619.072 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని రిజర్వు బ్యాంక్ శుక్రవారం వెల్లడించింది. విదేశీ కరెన్సీ రూపంలో వున్న ఆస్తుల విలువ పెరగడం ఇందుకు దోహదం చేశాయని పేర్కొంది. గతవారాంతానికి విదేశీ కరెన్సీ ఆస్తుల విలువ 2.405 బిలియన్ డాలర్లు ఎగబాకి 548.188 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అలాగే పసిడి రిజర్వులు 473 మిలియన్ డాలర్లు ఎగబాకి 47.848 బిలియన్ డాలర్లకు చేరుకోగా..ఎస్‌డీఆర్‌లు 89 మిలియన్ డాలర్లు అధికమై 18.197 బిలియన్ డాలర్లకు చేరాయి. అలాగే ఐఎంఎఫ్ వద్ద ఉన్న నిల్వలు 9 మిలియన్ డాలర్లు అధికమై 4.839 బిలియన్ డలర్లకు చేరాయి.

నెఫ్ట్ లావాదేవీలు 4 కోట్లు

ముంబై, మార్చి 1: నెఫ్ట్ సిస్టమ్ మరో మైలురాయిని అధిగమించింది. రోజువారీ లావాదేవీల సంఖ్య 4 కోట్లు దాటింది. గత నెల 29న 4,10,61,337 ఆర్థిక లావాదేవీలు నెఫ్ట్ ద్వారా జరిగాయని రిజర్వు బ్యాంక్ తెలిపింది. ఒకే రోజు ఇంతటి స్థాయిలో లావాదేవీలు జరగడం ఇదే తొలిసారి.రిటైల్, హోల్‌సేల్ చెల్లింపులు జరిపేవారికోసం రిజర్వు బ్యాంక్.. ది నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్(నెఫ్ట్) రియల్ టైం గ్రాస్ సెటిల్‌మెంట్(ఆర్‌టీజీఎస్) సిస్టమ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది.

నయా కార్లు వచ్చేస్తున్నాయి..

మూడు మాడళ్లను పరిచయం చేయనున్న సంస్థలు

మహీంద్రా ఎక్స్‌యూవీ 300

న్యూఢిల్లీ, మార్చి 1: దేశీయ మార్కెట్లోకి మరో మూడు కార్లు అందుబాటులోకి రాబోతున్నాయి. దేశవ్యాప్తంగా ఎస్‌యూవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని హ్యుందాయ్, మహీంద్రా, చైనాకు చెందిన ఈవీల తయారీ సంస్థ బీవైడీ కూడా తమ నూతన మాడళ్లను మార్చి నెలలో విడుదల చేయబోతున్నట్లు ప్రకటించాయి. వీటిలో హ్యుందాయ్ సరికొత్తగా ఎన్-లైన్ మాడల్‌ను పరిచయం చేస్తుండగా..మహీంద్రా ఎక్స్‌యూవీ 300 ఫేస్‌లిఫ్ట్, బీవైడీ తన తదుపరి మాడల్‌ను ప్రవేశపెట్టబోతున్నది. వీటి వివరాలు..

మార్కెట్లోకి నయా ఎక్స్‌యూవీ300ని విడుదల చేయబోతున్నది మహీంద్రా అండ్ మహీంద్రా. కారు ఇంటీరియర్‌తోపాటు బయట సైడు డిజైనింగ్‌లో పలు మార్పులు చేసిన సంస్థ..బంపర్లు, లైటింగ్ సెటప్‌ను అప్‌డేట్ చేసి విడుదల చేస్తున్నది. మార్చి నెలలో విడుదలకానున్న ఈ మాడల్ ధర రూ.9 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా.

బీవైడీ సీల్

హ్యుందాయ్ క్రెటా ఎన్ లైన్

చైనాకు చెందిన ఈవీల తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్లోకి సరికొత్త ఈవీని అందుబాటులోకి తీసుకురాబోతున్నది. మార్చి 5న రెండు బ్యాటరీ ప్యాక్ ఆప్షన్(61.4 కిలోవాట్లు, 82.5 కిలోవాట్లు), సింగిల్ చార్జింగ్‌తో 570 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇచ్చే వాహనాలను విడుదల చేస్తున్నది. 15 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, రెండు వైర్‌లెస్ చార్జర్లు వంటి టెక్నాలజీతో తయారు చేసింది. ఈ కారు ధర రూ.55 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా.

దేశీయ మార్కెట్లోకి సరికొత్త క్రెటాను ప్రవేశపెట్టడానికి సిద్ధమైంది హ్యుందాయ్. కాంపాక్ట్ ఎస్‌యూవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మార్చి 11న క్రెటా ఎన్-లైన్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 1.5 లీటర్ టర్బో-పెట్రోల్ ఇంజిన్, ఆరు-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో తీర్చిదిద్దింది. ఈ కారు ధర రూ.17.50 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా.

మొబైల్ యాప్స్‌పైనే షాపింగ్

దేశంలో 60 శాతానికిపైగా వినియోగదారులది ఇదే దారి

పీడబ్ల్యూసీ ఇండియా తాజా నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 1: ఒకప్పుడు షాపింగ్ అంటే ఉత్సాహం.. అంతకుమించిన సందడి. అయితే ఇప్పుడెక్కడా ఈ పరిస్థితులు లేవు. కారణం.. తీరికలేని యాంత్రిక జీవనం, ట్రాఫిక్ తదితర సమస్యలే. అందుకే సంప్రదాయ కొనుగోళ్లను పక్కనబెట్టి ఆన్‌లైన్ షాపింగ్‌కు తెరతీశారంతా. స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ సౌకర్యం అందరికీ అందుబాటులోకి రావడంతో ఆన్‌లైన్ మార్కెట్ అంతకంతకూ వ్యాపిస్తున్నది. ఇందుకు తగ్గట్టే ఓ తాజా సర్వే ఫలితం కూడా రావడం గమనార్హం. మొబైల్ యాప్స్ ద్వారానే షాపింగ్‌ను చేసేందుకు దేశంలో 60 శాతానికిపైగా వినియోగదారులు ఇష్టపడుతున్నట్టు పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక ఒకటి చెప్తున్నది. సులువుగా, ఎటువంటి భారం, ఇబ్బందుల్లేకుండా షాపింగ్ పూర్తవుతుండటమే ఇందుకు కారణమని 'ఆన్‌లైన్‌లో భారతీయ దుకాణాలు ఎలా?: మహానగరాలు, 1-4 శ్రేణి పట్టణాల్లోని వినియోగదారుల ప్రాధాన్యం' పేరుతో విడుదల చేసిన రిపోర్టులో పీడబ్ల్యూసీ ఇండియా పేర్కొన్నది.

డిస్కౌంట్లతో..

ఆన్‌లైన్ షాపింగ్‌కు ఎక్కువమంది మొగ్గు చూపడానికి కారణాల్లో కొనుగోలుదారుల సౌకర్యానికితోడు పెద్ద ఎత్తున లభిస్తున్న డిస్కౌంట్లు కూడా ఉన్నాయని పీడబ్ల్యూసీ ఇండియా చెప్తున్నది. అంతేగాక రోడ్ల మీదున్న దుకాణాల్లో పరిమిత ఉత్పత్తులు, తక్కువ వెరైటీలుంటున్నాయని.. అదే ఆన్‌లైన్‌లో అపరిమిత స్థాయిలో ప్రొడక్ట్స్, ఎన్నో రకాలుంటున్నాయని వివరించింది. ఇకపోతే గత కొన్నేండ్లుగా సాగుతున్న దేశీయ ఆన్‌లైన్ షాపింగ్ తీరుతెన్నులను పరిశీలిస్తే.. ద్వితీయ, తృతీయ, నాల్గో శ్రేణి పట్టణాల్లో వినియోగదారులు పెరుగుతున్నట్టు తేలింది. దేశవ్యాప్తంగా రకరకాల మార్గాల్లో, విభిన్న వర్గాలకు చెందిన 2,100 మంది అభిప్రాయాలను ఈ సర్వేలో పీడబ్ల్యూసీ తీసుకున్నది. ఇదిలావుంటే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ప్రకటనల్ని చూసి కొంటున్నవారూ భారీగానే ఉంటున్నారని సర్వే తేల్చింది. అయితే ఆన్‌లైన్ మోసాల నుంచి తప్పించుకునేందుకు చాలామంది క్యాష్ ఆన్ డెలివరీ ఆప్షన్‌ను ఎంచుకుంటున్నట్టు బయటపడింది.

జీఎస్టీ వసూళ్లు 1.68 లక్షల కోట్లు

ఫిబ్రవరిలో 12.5 శాతం పెరుగుదల

న్యూఢిల్లీ, మార్చి 1: జీఎస్టీ వసూళ్లు అంతకంతకు పెరుగుతున్నాయి. ఫిబ్రవరి నెలకుగాను రూ.1,68,337 కోట్ల మేర పన్ను వసూలయ్యాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలైన వసూలైన రూ.1.51 లక్షల కోట్లతో పోలిస్తే 12.5 శాతం అధికమని పేర్కొంది. దేశీయ లావాదేవీలపై జీఎస్టీ వసూళ్లు 13.9 శాతం అధికమవగా, దిగుమతైన వస్తువులపై వసూలయ్యే జీఎస్టీ 8.5 శాతం వృద్ధి కారణంగా వసూళ్లకు వృద్ధికి దోహదం చేసినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. వరుసగా నాలుగో నెల రూ.1.6 లక్షల కోట్ల అధికంగా నమోదవడం ఇది తొలిసారి కావడం విశేషం. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత గరిష్ఠంగా ఏప్రిల్ 2023లో రూ.1.87 లక్షల కోట్లు వసూలైన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఈ ఏడాది జనవరిలో రూ.1.74 లక్షల కోట్లు, అక్టోబర్ 2023లో రూ.1.72 లక్షల కోట్లుగా ఉన్నాయి. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి మధ్యకాలంలో జీఎస్టీ వసూళ్లు ఏడాది ప్రాతిపదికన 11.7 శాతం పెరిగి రూ.18.40 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు సరాసరిగా ఒక్కో నెలలో రూ.1.67 లక్షల కోట్లుగా వసూలయ్యాయి.

తెలంగాణలో 5,211 కోట్లు

తెలంగాణ రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు 12 శాతం పెరిగాయి. ఏడాది క్రితం రూ.4,424 కోట్లుగా ఉన్న వసూళ్లు ఈ ఏడాది అదే నెలలో రూ.5,211 కోట్లకు చేరుకున్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అదే ఆంధ్రప్రదేశ్‌లోనూ వసూళ్లు 3 శాతం పెరిగి రూ.3,678 కోట్లకు చేరుకున్నాయి. ఏడాది క్రితం ఇది రూ.3,557 కోట్లుగా ఉన్నాయి.

భారత పర్యటనలో భాగంగా శుక్రవారం గుజరాత్‌లోని కేవడియా వద్దగల స్టాచ్యూ ఆఫ్ యూనిటీని మైక్రోసాఫ్ట్ కో-ఫౌండర్ బిల్ గేట్స్ సందర్శించారు. ఈ సందర్భంగా వల్లభ్‌భాయ్ పటేల్ జ్ఞాపికను అందుకుంటున్న దృశ్యం